# చిత్రానికి హత్య

[చిన్న కథ]

చిత్రకారుడు సేట్‌జీ రెండో భార్య చంపను హరించాడు. సేట్‌జీ సామాన్యుడా! ఆశ్రయమిస్తూనే సేట్‌జీ చతురతగా చిత్రకారుడిమీద కసితీర్చుకున్నాడు. చిత్రకారుడి చిత్రాలన్నీ సేట్‌జీ ఇంట్లో మగ్గిపోయాయి. ఒక ఉత్తమ చిత్రానికి చిత్రకారుని కళ్ళ ఎదుటే హత్య. ఆ హత్యతో అతని మరణం పూర్తి ఐంది.

రచయిత:

గుంటూరు సత్యనారాయణ, ఎం. ఏ.

౧

ఆ చిన్న నుదురూ, పొదలవంటి కనుబొమలూ, వంకరతిరిగిన ముక్కూ, అడ్డదిడ్డంగా ఉన్న పలువరసా, చూసినవాళ్లెవరూ సేటుజీని కళాపిపాసగలవాడను కోరు. అమితమైన ధనసంపత్తీ, నలభయ్యోపడిదాటినా మొక్కపోని శరీరం, చక్కటి రెండో పెళ్ళిపెళ్ళాం— ఏవీకూడా కళాపిపాసను సూచించవు. కాని, సేట్‌జీ మేడలో ఎక్కడచూచినా చిత్రాలే. అందులో ఒక చిత్రం కూడా ఐదువందల తక్కువఖరీదు లేదు; ఆగదుల్లోకి వెళ్ళిన చిత్రకారుడికి వేరే సిఫారసు అక్కరలేదు. ప్రతి చిత్రకారుడూ మొదట సేట్‌జీని, తరువాత ప్రపంచాన్ని మెప్పించడానికి యత్నించేవాడు. చిత్రకళాకౌశల్యం గుర్తించడంలో సేట్‌జీది అందెవేసినచేయి.

కాని ముఖాముఖిగా అతణ్ణిచూసినవాళ్లు చాలతక్కువ. అందువల్లా అన్ని అతణ్ణిగురించి ఎన్నో కట్టుకథలు గిరాకిగా ఉండేవి. సాధారణంగా అంత క్రూరుడు ఉండడని ప్రతీతి. ఈ అపవాగుమీద, అతడి కళాపిపాస చక్కగా ప్రకాశించింది.

ఆదినం ప్రతి పత్రికలోనూ, నాటి చిత్రరచనాప్రదర్శనంలోని "నటరాజతాండవం" చిత్రంగురించి అంతులేని ప్రశంసలు ప్రచురింపబడ్డవి. ప్రతివారూ ఆదేమాట. క్రమంగా సేట్‌జీ చెవుల్లో పడ్డది. ఆమరునాడు అతడు ప్రదర్శనశాలకు వెళ్లేడు...

ఎన్నడూరాని సేట్‌జీ వచ్చేడంటే, ఆ 'నటరాజు'ని చిత్రించిన కళాకారుడిదే అదృష్టం అనుకున్నారంతా. జనులు తండోపతండంగా వచ్చేరు— సేట్‌జీ ఆ బొమ్మను ఎంతకు కొంటాడో చూడ్డానికి. సేట్‌జీ లోనికివెళ్ళగానే ఆచిత్రం ఆహ్వానించింది. ఒకసారి చూచేడు. అంతే... మరి ఆచిత్రందృష్టిలేగు. జనం విస్తుబోయింది. ఒకమూలను గోడకువేలాడుతున్న, చిన్న చిత్రందగ్గరకు తిన్నగా వెళ్ళి అతడు ఆగిపోయేడు. 'సముద్రుడు' ఆచిత్రంపేరు. దిగువ చిన్నచీటీపై 'అమ్మబడగు' అని చదివేడు. చిత్రకారుడిపేరు చూచేడు— రామం... మాటాడకుండా తిరిగివచ్చేడు.

మరునాడు పత్రికలన్నీ ఆ చిన్న చిత్రాన్ని అమితోత్సాహంతో ప్రశంసించేయి. రామానికి చిత్రరచనలో ఉన్నతస్థానం ఏర్పడింది ... తరువాత పత్రికలు చెప్పేయి, ఆచిత్రానికి సేటుజీ రెండు వేలిచ్చేడని...

ఆవేళ రామం, శుభ్రమైన బట్టలు వేసుకు సేట్‌జీ ఇంటికి విందుకు బయలుదేరేడు. సేట్‌జీ గుమ్మంవద్ద స్వాగతం ఇచ్చి లోనికి తీసుకెళ్ళేడు. విందుదగ్గర రామానికి తనభార్యను పరిచయం చేశాడు: చంప పందొమ్మిదేళ్ళపిల్ల; చాలా అందమైనది; సేట్‌జీ డబ్బుకు బలియైనది. రామాన్ని చూడగనే ఆమెకు నూతన వికాసం కలిగింది ..

రామం చిత్రాలు రాస్తున్నాడు; సేట్‌జీ తప్పకుండా వాటిని కొంటున్నాడు. నిత్యం రామం సేట్‌జీ ఇంటికి వెళుతూండేవాడు. క్రమంగా చంపకూ, రామానికీ సంబంధమేర్పడ్డది. చడీ చప్పుడూ లేకుండా ఒకనాడు ఇద్దరూ లేచిపోయేరు ..

సేట్‌జీ చలించలేదు. అతడి మౌనం ప్రపంచాన్ని విస్తుపరిచింది. ఆమె సంగతే ఎత్తేవాడుకాడు; పైగా ఎవరైనా ఆప్రాసెత్తితే, నవ్వుతూ 'వాళ్ళప్రేమ నేనెందుకు కాదనాలి?' అనేవాడు.

ఇప్పటికీ సేటుజీ రామం చిత్రంవస్తే, మునుపటికన్న ఎక్కువధనం యిచ్చి కొనేవాడు. ఎవరన్నా ఆసంగతి తెస్తే, నిట్టూర్చి: 'ఆచిత్రకారుడిది ప్రతిభ. నేనేం చెయ్యగలను?' అనేవాడు!

## ౨

కొన్ని నెలల తరువాత, రామంఎక్కడున్నదీ బహిరంగమైంది. సేట్‌జీ వెంటనే, వారిద్దరినీ క్షమించి, తనవద్దనే ఉండమని జాబువ్రాసేడు; తనకేమీ అసూయలేదనీ, రామంచిత్రాలంటే తనకభిమానం రోజురోజుకూ ఎక్కువై పోతున్నదనీ, తనవద్దనే ఉండి చిత్రాలువ్రాయవలసిందనీ, రాసేడు. రామం చాలా పశ్చాత్తాపపడి, తిరిగివచ్చేడు.

సేట్‌జీ నవ్వుతూ 'అబ్బాయ్! మిమ్మల్నిచూస్తే నాకు నవ్వువస్తోంది. మీ ఇద్దరిమధ్యా అనురాగం ఉంటే నేను కాదంటానా? వింతగా ఉందా? నీకు బోధపడదు. నీచిత్రాలన్నీ కొనెయ్యాలని నా ఆశయం. నీపేరుతో నాపేరుకూడా శాశ్వతంగా ఉండిపోవాలి. డబ్బుతో అమరత్వం కొనుక్కుంటున్నాను!'

ఈభరోసాతో రామానికి పూర్తిగా ధైర్యంవచ్చింది. సేట్‌దగ్గరే బసచేశాడు. అహోరాత్రాలు విసుగూ విరామం లేకుండా చిత్రాలురాసి ఇస్తున్నాడు సేట్‌జీకి. పైప్రపంచానికిదో తమాషాగా ఉంది...రామం కీర్తి ఖండాంతరాలు వ్యాపించింది. కాని, ఒక్కరూ అతడి చిత్రాలు ఇతరుచోట్ల చూడలేదు. అన్నీ సేట్ భవనాన్ని అలంకరిస్తున్నాయి. కాని సేటుజీ ప్రాపే అతడి కీర్తికి కారణం అయింది...

విశ్రాంతిలేకుండా పని చెయ్యడంతో రామానికి జబ్బుచేసి, చాలాకాలం మంచం పట్టేడు...

## ౩

ఆవేళ సేటుజీభవనం నిశ్శబ్దంగా, కళావిహీనంగా ఉంది. సాయంత్రం ఆరుగంటలవేళ. ఆపెద్దగదిలో గోడలనిండా రామం చిత్రాలు వ్రేలాడుతున్నాయి. గదిమధ్య, పట్టుపరుపుల్లో శల్యమై, రామం బాధపడుతున్నాడు. కిటికీలన్నీ మూసిఉన్నాయి. ఇక నిమిషాలమీదవుంది అతడిజీవితం. సేటుజీ మంచందగ్గర నుంచుని, రోగి కళ్ళలోకి చూస్తున్నాడు తీక్షణంగా. సేటుజీ కళ్ళలో, ఇదివరకెన్నడూ తనుచూడని, మెరుగు కనుపించింది రామానికి; భయంతో ఒణికి కళ్లుమూసుకున్నాడు...కొంతసేపయాక, సేటుజీ:

'రామం!'

రామం కళ్లువిప్పేడు.

'అబ్బాయ్! ఇక కొన్ని నిముషాల్లో నీకీ లోకంతో ఋణం తీరిపోతుంది. నువ్వు నాకు తీరని అపకారంచేశేవు. నేను చంపను ఎంత ప్రేమిస్తున్నానో నీకు తెలీదు. నువ్వువచ్చి మమ్మల్ని వేరుచేశేవు. పొందిన అపకారం మరచిపోడం నాజాతకంలో లేదు. ఇన్నాళ్లు నేను చిత్రాలన్నీ ఎందుకు కొన్నానో తెలుసుకున్నావా? నీ చిత్రం ఒక్కటీ పైకి పోకుండా కొన్నాను. ఇక పైకిపోవు. నాలో హరించిపోతాయి. నీకు అమరత్వంలేదు. నీతో నీకీర్తి హరించిపోతుంది. ఇందులో ఒక్కచిత్రంకూడా వెలుతురు చూడదు!'

రామానికి క్రమంగా బోధపడింది సేటుజీ ఎంత చతురంగా, ఎంతఘోరంగా కసితీర్చుకొంటున్నాడో. మాటాడలేకపోయాడు. నీరసమైన కళ్ళతో ఆ 'సముద్రుడు' చిత్రాన్ని చూస్తున్నాడు. గుండెలలో బాధ ఎక్కువైంది. క్రమంగా చీకటి ఎక్కువైంది. గదిలో వస్తువులు లీలగా కనుపిస్తున్నాయి...

సేటుజీలీల క్రమంగా మంచందగ్గర నుంచి కదిలింది; చేతిలో కత్తి విప్పింది; క్రమంగా, చట్రంలో అమర్చిన 'సముద్రుడు' చిత్రంవైపు సాగింది... చెయ్యి పైకిలేచింది...

రామం, అంత్య ప్రయత్నంతో 'సేటుజీ'అన్నాడు వినుపించని స్వరంతో...

'కసక్'...

చిత్రం 'ఛర్రు'మన్నది...

రామంశరీరం వెనక్కుపడ్డది...


# ఆలసించిన దొరకని హాస్యగ్రంథాలు

5 అణాల పోస్టుబిళ్లలు పంపితే

1. పెళ్లాన్ని ఎలాపిలవడం 2. అనుమానాలు ఆయన - ఆవిడ, 3. ధ్రువ, 4. చింకిజోడు, 5. తాళంచెవి తగాదా.

అనే ఐదు కడుపుబ్బ నవ్వించు హాస్యగ్రంథాలు పోస్టేజి మేమే భరించి మీకు పంపిస్తాము.

—నేడే పంపించండి—

ఆంధ్రభూమి బుక్కుడిపో, వేపేరి పోస్టు, మద్రాసు.